


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**74**

(24' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మూడుముళ్ళు..** అనే మాటను ఇదివరలో ముచ్చటగా వాడుతూ వుండేవారు.

"ఎదుగుతున్న ఆడపిల్లను చూచి, మూడు ముళ్ళూ పడేదాకానే ఈ ముద్దూ పురిపెం. తర్వాత ఆవిడ అక్కడ - మనం ఇక్కడా. కన్ను పొడుచుకుంటేగానీ కనిపించదు" అనుకుంటూ వుండేవారు.

పుట్టింట్లో పకపకలాడుతూ, పట్లీలు కొడుతూ వుండే ఆడపిల్లల్ని గురించి మాట్లాడేటప్పుడు పెద్దవాళ్ళు అంటూ వుంటారు. "ఈ కొద్దిరోజులే ఏం ఎగిరి గంతులు వేసినా! ఆ మూడు ముళ్ళు పడితే అంతా మూగవాళ్ళయిపోతారు" అని.

"ముద్ద పెట్టలేని వాడు మూడు ముళ్ళూ ఎందుకు వెయ్యడం? ఆ మూడు ముళ్ళతో పంచప్రాణాలు లాక్కుంటాడు." అని కొందరు వ్యాఖ్యానిస్తూ వుంటారు.

***భుక్తిముడి, భక్తిముడి - ముక్తిముడి***

అసలా మూడు ముళ్ళకూ అర్థమేమిటి? "భక్తి, భుక్తికీ, ముక్తికీ బాధ్యుడనని చెప్పడమేగా! ఈ ముళ్ళకు అగ్నిదేవుడు సాక్షి. అష్టదిక్పతులూ సాక్షి. ముడేసి తప్పించుకొన్నవాడిని యమదూతలు పడేసి లాక్కుపోతారు" అని పండితులు వ్యాఖ్యానించడం కద్దు.

సంసార బాధ్యత సరిగా పట్టించుకోకుండా తప్పించుకుని తిరిగే యువకుల్ని చూచినప్పుడు పెద్దలు సలహా చెపుతూ వుంటారు - "ఒక పిల్లను చూచి వీడిచేత మూడు ముళ్ళూ వేయించండి. ముంగితనం అంతా పోయి రంగా! పాండు రంగా! ఎలా నడుపుతానో ఈ సంసారం. తెల్లవారు ఝామున లేచి నీ అభంగాలు పాడుకుంటూ బెంగలేకుండా చెయ్యి సంసారం విషయంలో అని మొక్కుకుంటూ వుంటాడు" అని.

మా వూళ్ళో ఒక ఇల్లాలు చెరువు దగ్గిర స్నానానికి వచ్చి - నీటిలో తను మునక్కుండా బిందె ముంచకుండా రెండు గంటలు నిలబడి వుండేది. ప్రతిరోజూ ఆవిడ చెప్పే వాక్యాలలో వెయ్యడానికి మూడుముళ్ళూ వేశాడు. కానీ ఒక్క ముడి వేసిన బాధ్యతన్నా పైన వేసుకోవడం లేదు. తక్కిన ముళ్ళు వూరుకోలేక వేసినవే. అనేది తప్పకుండా వుండేది.

***పెండికట్లు కట్టినట్లు కట్టాడు.***

కొందరు గయ్యాళి భార్యలు భర్తల్ని తలచుకుని బడబడా మాట్లాడుతూ "పెళ్ళిరోజున ఒళ్ళు తెలియక పెండికట్లు కట్టినట్లు మెడకు కట్టాడే సూత్రం. ఈడొచ్చినవాడే గదా - సూత్ర బంధనలోగల నిబంధనలెరుగడా? అనుకున్నాం. కానీ ఆ ముళ్ళతోనే భార్యకు మోక్షం వస్తుందనుకున్నాడు గావన్ను. మళ్ళీ వాటిమాటే పట్టించుకోవడం మానేశాడు" అంటూ మెత్తని ధూళి ఆయన శిరస్సున జల్లించి పోస్తూ వుంటారు.

ఈ రోజుల్లో మూడు ముళ్ళు పడటమనేది పెద్ద క్రతువుగా పరిణమించింది. "సంసారాలలో ముద్దుగా పెంచాం. బుద్ధులు చెప్పించాం. పుణ్యవ్రతాలు చేయించాం కాళ్ళు కడిగి మీకు అందించదలిచాం? మూడు ముళ్ళూ వేసి మురుస్తూ తీసుకు వెళ్ళండి" అంటే కళ్ళెర్రచేసి "కానుకలేం ఇస్తావో చెప్పవేం? ఒక స్కూటర్ నాకివ్వాలి. ఒక హీటర్ మీ అమ్మాయికివ్వాలి. ఒక రేడియోగ్రాం నాకివ్వాలి. ఒక గ్యాస్ స్టవ్ మీ అమ్మాయికివ్వాలి. ఒక టేప్ రికార్డర్ నాకివ్వాలి. ఒక గ్రైండర్ మిషన్ మీ అమ్మాయికివ్వాలి. ఒక బ్రయిస్ కూలర్ నాకివాలి. ఒక ఎయిర్‌కూలర్ మీ అమ్మాయికివ్వాలి. ఆధీనం తప్పిన మా అమ్మ అన్ని పుణ్యక్షేత్రాలు తిరిగేందుకు ఎయిర్ టికెట్ కొని ఇవ్వాలి. పెద్దమనుషులు కాని చెల్లెళ్ళిద్దరున్నారు. వారు చదివినంతకాలం మీరే స్వయంగా స్కాలర్‌షిప్‌లివ్వాలి. " అంటూ ఒక జాబితా అందచేస్తారు.

***అమ్మాయి మెడకు మూడు - నా మెడకు ముప్పయి***

ఇలాటి కోరికలన్నీ విన్న ఒక తండ్రి "మా అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళూ నా మెడకు ముప్పయి ముళ్ళూనా?" అని వెర్రిమొహం పెట్టాడుట.

పూర్వకాలంలో మూడు ముళ్ళూ పడ్డ పిల్లను, ముద్దుగా అత్తవారింటికి పంపుతుంటే అందరి కన్నీళ్ళూ వాగులయ్యేవి. ఈ రోజుల్లో ఆడపిల్ల పుట్టినప్పటి నుంచీ కళ్ళు సెలయేళ్ళుగా మారిపోతున్నాయి. ఎన్ని కానుకలివ్వాలో, ఎలాటివాడొస్తాడో, పిల్ల ఏమైపోతుందోనన్న భయం ఏర్పడుతోంది.

సంసారాలు సక్రమంగా సాగడంలేదని తెలుసుకొన్నప్పుడల్లా తల్లితండ్రుల హృదయాలు ఉల్లిపొరల్లాగా వూడిపోతున్నాయి. ఇటీవల ఒక గృహస్తు పిల్ల పెళ్ళిచేయడానికి ఎంతో ప్రయత్నించి విఫలుడయ్యాడట చివరకు ఎవడో ఒకణ్ణి నామ్‌కేవాస్తే నాథుణ్ణి కుదుర్చుకు వచ్చారు.

"ఇదేమిటి నాన్నగారూ, ఈయనెక్కడ దొరికాడు? ఎలా పెళ్ళాడేది?" అని కుమార్తె ప్రశ్నించిందిట.

"ఏం చెయ్యమంటావమ్మా.. ఎంతో వెతికాను. ఎక్కడా సరి అయినవాడు కుదరలేదు. ఎంతకాలం వుంచనమ్మా నిన్నిలా మెళ్ళో మూడుముళ్ళూ పడాలిగదా?" అన్నాడు తండ్రి.

***మూడుముళ్ళకు బదులు ఒక్కముడి.***

"బయటివాడెవడో వచ్చి మూడు ముళ్ళు వేయడం దేనికి నాన్నగారూ! నే నొక్కముడి వేసుకుంటే సరిపోతుందిగా మీకు శ్రమ" తప్పుతుంది అన్నదట కుమార్తె.

కానీ వాళ్ళచేత కంఠానికి ఉచ్చులు బిగింపచేసుకుని జీవితమంతా నరకయాతన పడటమెందుకని చాలామంది ఈడొచ్చిన పిల్లలు కీడెంచి, అఘాయిత్యాలకు దిగడం కూడా జరుగుతోంది.

బాగా వయసు వచ్చిందాకా పెళ్ళి చేయకుండా ఇంట్లో వుంచి, ఇల్లు కాలుతుండగా నుయ్యి త్రవ్వే ప్రయత్నాలు జరపడం పరిపాటి అయిపోయింది ఈరోజుల్లో. "కుర్రవాడి వివరాలు, వంశమర్యాదలు, రాబడిపోబడులు విచారించండి కొంచెం. జీవిత బంధంగాదా ఇది మరి " అని భార్య అంటే -

"ముందు మూడుముళ్ళూ పడనీ తర్వాత ఆలోచిద్దాం. నువ్వు చెప్పిన ప్రకారం పెళ్ళి చెయ్యాలంటే పిల్లకు ఎనిమిదో ఏటే అన్వేషణ ప్రారంభించాల్సింది" అని భర్త సమాధానం.

"ముళ్ళు పడగానే సరిటండీ పిల్ల తర్వాత కడగళ్ళలో పడదూ ఇంత ఆలస్యం ఎలాగూ అయింది గనుక మారాం ముళ్ళు లేని సంసారంలో పడితే కొంత నయం" అని భార్య.

"మారాం ముళ్ళో ఏమో ఎలా తెలుస్తుందే ఏ కుర్రవాణ్ణి చూచినా ఎంతో ఎత్తునుంచి మాట్లాడుతున్నారు. కాస్త పలకరిస్తే పరవళ్ళు తొక్కుతున్నారు. ఆడపిల్లల్ని కన్నవాళ్ళు గుండెలు జీలగబెళ్ళు అయిపోతున్నాయి" అని ఆయన దీనాలాపం.

**మనసులు ముళ్ళు పడటమే 'మహిమ'**

మొన్న ఒక యువకునికి చాలాకాలానికి సంబంధం కుదిరింది. లగ్నం సమయంలో మూడుముళ్ళూ వేసి ఆపకుండా ఏడెనిమిది ముళ్ళు వేసి పారేశాడు. "అక్కడ వున్నవాళ్ళు మూడు చాలయ్యా! అంతకన్నా ఎక్కువ వెయ్యకూడదు" అన్నారు.

"మీకేం తెలుసు ఉండండి. ఈ రోజుల్లో మూడు ముళ్ళ ఫోర్సు చాలడం లేదు. మళ్ళీ మళ్ళీ వేస్తామా ఏమన్నానా? పది ముళ్ళన్నా వేస్తేగానీ బాధ్యత తెలియదు. నేను సంసారం అందరి మల్లే చెయ్యదలచుకున్నా" అని నవ్వుతూ సమాధానం చెప్పాడు.

మనసులు ముళ్ళు వేసుకుంటే మంగళసూత్రం ముళ్ళు ఎలా వేసినా ఫర్వాలేదు. ఆ మనసులు ముళ్ళు పడనంత వరకు, తాళి బొట్టు కట్టడం ఎగతాళి అవుతుంది గాని - వలపుల పాళీ ఎలా అవుతుంది.

●●●

Post your comments